క్లుప్తంగా

కల్వర్టు నిర్మించాలి



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న శ్రీజ

మధిర: మధిర పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వెంటనే కల్వర్టు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు.. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), మధిర మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. గురువారం ఆమె మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రజలకు జరుగుతున్న అసౌకర్యాన్ని ఆమె పరిశీలించారు. ఈ సమస్య పరిష్కారం కోసం కల్వర్టు నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు.

అప్రమత్తతతోనే వ్యాధులు దూరం



మాట్లాడుతున్న వరికూటి సుబ్బారావు

బోనకల్: దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. మండలంలోని మోటమర్రిలో గురువారం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ సమావేశం నిర్వహించగా, 102 వాహనం ద్వారా 64మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ వ్యాధులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి స్రవంతి, ఉద్యోగులు దానయ్య, రాకేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు కీలకం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

వేంసూరు: భూమి సంరక్షణకు భూసార పరీక్షలకు కీలకమని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డి.స్రవంతి,డాక్టర్ ఐ.కృష్ణతేజ తెలిపారు. గురువారం మండలంలోని అడసర్లపాడులో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. నూతన టెక్నాలజీతో పంటలు సాగు చేసి ఖర్చులు తగ్గించుకొని, దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రాంమోహన్, ఏఎంసీ డైరెక్టర్ సత్యనారాయణ, ఏఈఓ కావ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం



బోనాలతో వెళ్తున్న మహిళలు

కొణిజర్ల: మండలంలోని రాజ్యాతండాలో కోదండరామాలయం, బొడ్రాయి, ముత్యాలమ్మ, దేవాలయాల మూడో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ భూక్యా తులిశ్య, సర్దార్ మూడ్ సిద్ధు, రమణ, కోకియా, శ్రీను, బాలు, బాసు, సాయిబాబా వినోద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా కార్యాలయాలపై దాడి సరికాదు

సత్తుపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సాక్షి పత్రికా కార్యాలయాలపై పలువురు దాడి చేయడాన్ని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సాక్షి కార్యాలయంపై దాడులు చేసి బోర్డులు తొలగించడం, పత్రికా ప్రతులను దహనం చేయటం వంటి చర్యలు సరైనవి కాదన్నారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సభను విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్: ఈ నెల 14న సత్తుపల్లి కళాభారతిలో బత్తుల వెంకటేశ్వరరావు జీవన రేఖల పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని బీవీఎంటీ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి విజయ్‌కుమార్, కూకలకుంట రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణతో..

విద్య మెరుగుపడేనా..?



ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ జయరాజు (ఫైల్)

- సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ
- మండలంలో 87 పాఠశాలలు.. 4,056 మంది విద్యార్థులు
- ఈ నెల 6 నుంచి 19 వరకు 'బడిబాట'
- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



కారేపల్లి పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు (ఫైల్)

కారేపల్లి: విద్యార్థుల్లో బాష, గణిత కనీస సామర్థ్యాల సాధన (ఎఫ్‌ఎల్‌ఎన్) దిశగా, తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు గుణాత్మకమైన బోధన, గ్రంథాలయ నిర్వాహణ, పీటీఎం నిర్వాహణ, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుట వంటి అంశాలతో.. పాఠశాల పునఃప్రారంభానికి ముందే వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి.. ఈ సారి సరికొత్తగా రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు సంసిద్ధమైంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి 19వ వరకు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది.

120 మందికి శిక్షణ..

గత నెలలో 5 రోజుల పాటు, వృత్తాంతర ఇన్ సర్వీసు మండలస్థాయి ఎస్‌జీటీ, ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం డీఎస్సీ 2008 ఉపాధ్యాయులు మండల వ్యాప్తంగా 120 మందికి శిక్షణ ఇచ్చింది. అంతకుముందు మండలంలోని 8మంది ఉపాధ్యాయులను రిసోర్సు పర్సన్లుగా ఎంపిక చేసి జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చింది. ఈ క్రమంలో కోర్సు డైరెక్టర్‌గా ఎంఈఓ జయరాజు వ్యవహరించి శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

87 ప్రభుత్వ పాఠశాలలు 4,056 మంది విద్యార్థులు..

గత ఏడాది మండలంలో 87 ప్రభుత్వ పాఠశాలలో 14 హైస్కూల్, 14 ప్రాథమికోన్నత పాఠశాలలు, 59 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 4,056మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. కాగా, పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే.. ఆయా ప్రభుత్వ పాఠశాలలోకి పాఠ్య పుస్తకాలు చేరాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు 21,081 పుస్తకాలు అవసరం ఉండగా, ఇప్పటివరకు 18,267 పాఠ్య పుస్తకాలు మండల వనరుల కేంద్రానికి చేరుకున్నాయి. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుడటంతో.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు సర్కార్ నిశ్చయించుకుంది.

సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం..



సర్కారు బడుల బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నాం. సర్కారు బడుల్లో సౌకర్యాలతో పాటు, నాణ్యమైన విద్యను అధించేందుకు ఉపాధ్యాయులు తీసుకున్న శిక్షణ విజయవంతమైంది. దీంతో పాటు ఉపాధ్యాయులు 'బడిబాట' కార్యక్రమం ప్రారంభించాం. ఇప్పటికే.. పాఠ్యపుస్తకాలు జిల్లా విద్యా కేంద్రం నుంచి మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్నాయి. ఇంకా 2వేలు పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది.

– జయరాజు, ఎంఈఓ, సింగరేణి

ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తారు..



నేను కారేపల్లి టీఎస్ మోడల్ స్కూల్‌లో చదువుతున్నాను. మా స్కూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించటంతో పాటు, పాఠాలు మంచిగా చెప్పుతుండడంతో.. మంచిగా అర్థమవుతుంది. చదువుతో పాటు, క్రీడల్లో కూడా మమ్మల్ని ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. మాలాగే మిగతా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సౌకర్యాలు మెరుగుపరచాలి.

– బి.నేహశ్రీ, 7వ తరగతి, టీఎస్ మోడల్ స్కూల్ కారేపల్లి

ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకం అందించాం

- జిల్లాలోనే మొదటి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం
- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



వేంసూరు: చిన్న మల్లెలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఇంటికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించి మేలు చేసిందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం మండలంలోని చిన్న మల్లెలలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని, తొలివిడుత ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోనే మొదటి ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం చిన్న మల్లెలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు వేంసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాణిక్యరావు, ఎంపీడీఓ రాజారావు, పంచాయతీ కార్యదర్శి దివ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు, యూనిఫాం పంపిణీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పాతసెంటర్ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లను ఎమ్మెల్యే రాగమయి పంపిణీ చేశారు. జలగంనగర్ అంగన్‌వాడీకేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలు చేసి కాంగ్రెస్‌పార్టీ జెండా ఆవిష్కరించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వర్ధంతి సందర్భంగా స్థానిక జేవీఆర్ పార్కువద్ద జలగం వెంగళరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ మెహరున్నీసా, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ రాజేశ్వరరావు, సూపర్‌వైజర్లు సుజాత, రమాదేవి, గంగాజలం, మహాలక్ష్మి, భవాని, రజిని, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, చెన్నారావు, కమల్‌పాషా, మురళీరెడ్డి, సామేలు, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణయ్య, అప్పారావు, కరుణాకర్, వీరస్వామి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ



చంద్రుపట్లలో పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో నీరజదేవి, నాయకులు

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్లలో గురువారం ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి ఇందిరమ్మ గృహాలు మంజూరైన 32మంది లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. కల్లూరు మండలానికి 756 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేశారని, అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ కొలతల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు వేలాద్రి, నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

వైరా: విద్యుత్ బిల్లులను సిబ్బంది సకాలంలో వసూలు చేయాలని విద్యుత్‌శాఖ ఖమ్మం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాస్ అన్నారు. వైరాలోని ఎస్‌వీఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న విద్యుత్ మీటర్లను సకాలంలో బిగించి విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైరా డీఈ బి.శ్రీనివాసరావు, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ



దుకాణంలో పత్తి గింజల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏడీఏ విజయచంద్ర

ముదిగొండ: ముదిగొండలోని నాలుగు విత్తన దుకాణాలను గురువారం మధిర ఏడీఏ విజయచంద్ర, ఏఓ సరిత తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణాలలో ఏఏ కంపెనీల పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ విజయచంద్ర మాట్లాడుతూ రైతులు నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోవద్దని అన్నారు. రైతుల ఇళ్ల వద్దకు వచ్చి విక్రయించే వారి సమాచారం ఇవ్వాలని తెలిపారు. పత్తి విత్తనాలు మొలకెత్తకపోతే వెంటనే కొనుగోలు చేసిన డీలర్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేయాలని, అప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

తేమశాతం ఉంటేనే విత్తనాలు నాటాలి..

కల్లూరురూరల్: ప్రస్తుతం కొద్దిపాటి స్థాయిలో కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారని, ఈ సమయంలో భూమిలో తగిన స్థాయిలో తేమశాతం ఉంటేనే విత్తనాలు నాటుకోవాలని కల్లూరు వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. రైతులు బిటీ 3 పత్తి విత్తనాలను కొనుగోలు చేయకూడదని తెలిపారు.

పంచాయతీల్లో జాబితా పెట్టాలి

బోనకల్: ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఆయా జీపీల్లో ఉంచాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల జాబితా రహస్యంగా ఉంచొద్దని, మొదటి, రెండో లిస్టు లంటూ ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి రామారావు, బాస్కర్‌రావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ దామాల పుల్లయ్యకు గురువారం కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, పూర్తి అయిన అమ్మా ఆదర్శ పాఠశాలల పనుల పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోపాల్‌రావు, చిన్న రంగారావు, సద్దాబాబు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన సత్యనారాయణ



భట్టికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యనారాయణ

వైరా: పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన వైరా వాసి నూతి సత్యనారాయణ గౌడ్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు.. నూతి సత్యనారాయణను అభినందించారు.

సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయినాధుడి ఆలయాల్లో స్వామివారికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో దాతలు దొడ్డా నగేష్ దంపతులు, శీలం వెంకటసుందరరామిరెడ్డి, అయిలూరి రామిరెడ్డి, శీలం వెంకటేశ్వరరెడ్డి భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



మధిర: మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్



వేంసూరు: సరస్వతిదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

> వేసవి సెలవుల అనంతరం పాఠశాలుల పునం ప్రారంభం కావడంతో పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్న రీతిలో స్వాగతం పలికారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు పాఠశాలలకు అర కొరగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు.. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.

మధిర/చింతకాని/బోనకల్/ముదిగొండ: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, తద్వారా ఉన్నత స్థాయికి చేరొచ్చని విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. బడిబాటలో భాగంగా మండలంలోని నిధానపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. అదే విధంగా చింతకానిలోని మత్కేపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ సలాది రామారావు, బోనకల్ ప్రాథమిక పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయబాస్కర్‌రెడ్డి, ఎంఈఓ దామాల పుల్లయ్య, ముదిగొండలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ విజయలక్ష్మి బడిబాట సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు అందజేశారు. అనంతరం గ్రామాల్లో బడిబాట కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యను చిన్నచూపు చూడొద్దన్నారు. ఈ కార్యక్రమాలల్లో పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లాడ/కల్లూరురూరల్/వేంసూరు: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎంఈఓ ఎస్.దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అంజనాపురం పాఠశాలలో విద్యార్థులతో తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ మాట్లాడారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలోని పెద్దకోరుకొండి హైస్కూల్‌కు తోరణాలు కట్టి తరగతులు ప్రారంభించారు. అదే విధంగా బత్తులపల్లి, ఎర్రబోయినపల్లి పాఠశాలల్లో, వేంసూరు మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ హెచ్‌ఎం వి.వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ భాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు/కారేపల్లి: ఏన్కూరు మండలంలోని గత రెండు సంవత్సరాలుగా మూతపడిన రాజులపాలెం పాథమిక పాఠశాలను ఎంఈఓ రహింబీ ప్రారంభించి, విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందించారు. ఏన్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు దుస్తులు అందించారు. అదే విధంగా కారేపల్లి పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి నవీన్‌బాబు విద్యార్థులకు పువ్వులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్ర, ఎంఈఓ జయరాజు, మహమ్మద్ నజీర్‌పాషా, మేదరి టోనీ, సురేందర్ మనియర్, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు



తల్లాడ: నూతనకల్ పాఠశాలలో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

చింతకాని: పూర్వ ప్రాథమిక విద్య కోసం 30 నెలల గడిచిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. చింతకాని మండలం కొదుమూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అమ్మమాట – అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేటువంటి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యత, ప్రీస్కూల్ మెటీరియల్, ఆటాపాటలతో కూడిన విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్రం ఆవరణలో కూరగాయ విత్తనాలు, ఆకు కూర విత్తనాలను నాటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రశాంతి

మధిర: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, మధిర కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రశాంతి అన్నారు. గురువారం అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మధిర కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేములతో కలిసి మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొజ్జ పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, నంబూరి జనార్దన్ రావు, రమేష్, రవి, వెంకట్రావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ..

బోనకల్: బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకోని చైల్డ్‌రైట్స్ అండ్ యూ ఆధ్వర్యంలో మండలంలోని గోవిందాపురం(ఎల్), ఆళ్లపాడు, ముష్టికుంట్ల, కలకోట, బోనకల్ గ్రామాల్లో గురువారం అవగాహన నిర్వహించారు. సంస్థ రూపొందించిన గోడ పత్రికలను తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ వెంకన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామాల పుల్లయ్య, లేబర్ ఆఫీసర్ చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఆర్డీఓ నర్సింహారావు

మధిర/చింతకాని/బోనకల్/ఎర్రుపాలెం: నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు వానాకాలం రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం ఆర్డీఓ జి.నర్సింహారావు, మండల వ్యవసాయాధికారులు సాయి దీక్షత్, సోములపల్లి మానస, పసునూరి వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం మధిరలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో, చింతకానిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, అదే విధంగా బోనకల్ రైతువేదికలో, ఎర్రుపాలెంలో మండలంలోని మామునూరు గ్రామం రైతు వేదికల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. దరఖాస్తు చేసుకునేందుకు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ లేదా డిజిటల్ సంతకం అయినటువంటి జిరాక్స్ అందజేయాలని కోరారు. ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు సేవింగ్ ఖాతా జిరాక్స్, దరఖాస్తు ఫారంను సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓకి) సమర్పించాలని సూచించారు. ఈనెల 5 నాటికి భూ భారతి (ధరణి) పోర్టల్‌లో ఉన్న పట్టాదారుల డేటా రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు సాయం అందించేందుకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నుంచి పొంది డిజిటల్ సంతకం అయిన రైతులు అర్హులని పేర్కొన్నారు. గతంలో రైతు భరోసా పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఉషాశారద, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శిరీష, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.